ప్రభాత
ఉదయం
తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 347 | పేజీలు: 6 | వెల: రూ.3/- | శుక్రవారం 27 మార్చి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# పెట్రోల్, డీజిల్ కొరత లేదు

## తప్పుడు ప్రచారాలు నమ్మవద్దు.. మరోసారి స్పష్టం చేసిన కేంద్రం



**న్యూఢిల్లీ, మార్చి 26 (ప్రభాత ఉదయం)**

దేశంలో పెట్రోల్, డీజిల్ నిల్వలపై కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పందించింది. దేశంలో పెట్రోల్, డీజిల్ కొరత అంటూ సోషల్ మీడియా ప్రచారం జరుగుతుండటం, బంక్‌ల వద్ద వాహనదారులు క్యూలు కడుతుండటంపై కేంద్రం ప్రకటన చేసింది. దేశంలో ఇంధన సరఫరా పూర్తిగా సురక్షితంగా, స్థిరంగా ఉందని వెల్లడించింది. దేశంలో ఎక్కడా పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి కొరత లేదని, అన్ని రిటైల్ అవుట్‌లెట్‌లు తగినంత సరఫరాతో సాధారణంగా పనిచేస్తున్నాయని స్పష్టం చేసింది. తప్పుడు సమాచారం, భయాందోళనలతో కూడిన కథనాలు పూర్తిగా నిరాధారమైనవని, పౌరులు అధికారిక వర్గాలను మాత్రమే విశ్వసించాలని సూచించింది. పుకార్లను వ్యాప్తి చేయకుండా ఉండాలని సూచించామని, ప్రతి పౌరునికి నిరంతరాయ ఇంధన లభ్యతను నిర్ధారించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొంది. పెట్రోలియం శుద్ధిలో ప్రపంచవ్యాప్తంగా భారత్ 4వ స్థానంలో ఉంది. అలాగే ఎగుమతి చేసే దేశాల్లో 5వ స్థానంలో ఉంది. దీంతో దేశీయంగా పెట్రోల్, డీజిల్ నిల్వలు, లభ్యత పటిష్టంగా ఉన్నాయని, సరఫరాలో రేషన్ చేయమని ఏ రిటైల్ కేంద్రాలకు ఆదేశాలు ఇవ్వలేదని కేంద్రం తెలిపింది. ఇంధన కొతర వల్ల కొన్ని దేశాలు జాతీయ ఇంధన అత్యవసర పరిస్థితి ప్రకటించాయని, దేశంలో అటువంటి చర్యల అవసరం ఏమాత్రం లేదని తెలిపింది. ఇతర దేశాల్లో పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లపై పరిమితులు విధిస్తున్నప్పటికీ.. దేశంలో అలాంటి పరిస్థితి రాదని తెలిపింది. కొన్ని పెట్రోల్ బంక్‌ల వద్ద భయాందోళనతో ప్రజలు కొనుగోలు చేస్తున్నప్పటికీ.. సోషల్ మీడియాలో ఉ ద్దేశపూర్వకంగా వ్యాప్తి చేసిన తప్పుడు సమాచారం వల్ల అలా జరుగుతున్నాయని స్పష్టం చేసింది. వినియోగదారులకు ఇంధనం నిరంతరం అందించేందుకు పెట్రోల్ బంక్‌లు పనిచేస్తున్నాయంది. కొరత లేకుండా చూసేందుకు బంక్‌లకు గతంలో అనుమతించిన ఒక రోజు క్రెడిట్‌ను మూడు రోజులకు పెంచడానికి కంపెనీలు చర్యలు తీసుకున్నట్లు కేంద్రం పేర్కొంది. "కేవలం 6 రోజులకు సరిపడ ఇంధన నిల్వలు మాత్రమే ఉన్నాయని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. భారత్‌లో మొత్తం 74 రోజులకు సరిపడ రిజర్వ్ సామర్థ్యం ఉంది. వాస్తవ నిల్వ కవరేజ్ సుమారు 60 రోజులు ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి పరిస్థితులు ఉన్నా.. రెండు నెలలకు సరిపడ సరఫరా అందుబాటులో ఉంది. ఎల్పీజీ కొరత లేదు. దేశంలో రిఫైనరీల్లో ఉత్పత్తి 40 శాతం పెరిగింది. దిగుమతి చేసుకోవాల్సిన గ్యాస్ కంటే ఎక్కువ ఉత్పత్తి జరుగుతుంది. అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా, ఇతర దేశాల నుంచి 800 టీఎంటీలతో కూడిన ఎల్పీజీ కార్గోలు దిగుమతికి సిద్ధంగా ఉన్నాయి. అదనను కొనుగోళ్లు నిరంతరం కొనసాగుతున్నాయి. ప్రతీ రోజు 50 లక్షలకుపైగా సిలిండర్లను సరఫరా చేస్తున్నాం. వాణిజ్య సిలిండర్ల కేటాయింపును 50 శాతానికి పెంచాం" అని పెట్రోలియం శాఖ స్పష్టం చేసింది.

### దావోస్ పర్యటనలో

## రూ.2.19 లక్షల కోట్లు పెట్టుబడులు

#### విపక్షాల విమర్శలను తిప్పికొట్టిన శ్రీధర్ బాబు



**హైదరాబాద్, మార్చి 26 (ప్రభాత ఉదయం)**

దావోస్ పెట్టుబడులు, ఎంవోయూలపై శాసనసభలో విపక్ష సభ్యులు చేసిన విమర్శలను మంత్రి శ్రీధర్‌బాబు తిప్పికొట్టారు. దావోస్ పర్యటనల్లో తెలంగాణకు రూ. 2.19 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. పెట్టుబడిదారులతో ప్రభుత్వం 44 ఎంవోయూలు కుదుర్చుకుందని వెల్లడించారు. ఈ ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. దావోస్ పర్యటనల్లో 44 ఎంవోయూలు ప్రభుత్వం ..మిగతా 2లో

### ఇరాన్‌కు మరోమారు

## ట్రంప్ వార్నింగ్

#### ఆలస్యం చేస్తే పరిస్థితులు మారిపోతాయి

#### త్వరగా ఒప్పందానికి రావాలని హెచ్చరిక

2లో..



### గత ప్రభుత్వం

# బకాయిలు కడుతున్నాం

### విద్య,వైద్యానికి ప్రత్యేక ప్రాధాన్యత

#### గత ప్రభుత్వం బకాయిలు కడుతున్నాం

#### ఆరోగ్యశ్రీ కింద 600 కోట్ల బకాయిలు పెట్టి వెళ్లారు

#### ఇప్పటివరకు రూ.2,408 కోట్ల బిల్లులు చెల్లించాం

#### సిఎంఆర్‌ఎఫ్ నిధులను దుర్వినియోగం చేశారు

#### అసెంబ్లీలో సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మార్చి 26 (ప్రభాత ఉదయం)**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకానికి రూ.600 కోట్లు బకాయిలు పెట్టి వెళ్తే తాము ప్రతినెలా రూ.89 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఇప్పటివరకు రూ.2,408 కోట్ల బిల్లులు చెల్లించామని అసెంబ్లీ సాక్షిగా తెలిపారు. ఏడో రోజైన గురువారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సభలో సీఎం రేవంత్ ప్రసంగించారు. ఆరోగ్య శ్రీ కింద ప్రభుత్వాసు పత్రులకు రూ.927 కోట్లు, ప్రైవేట్ ఆస్పత్రులకు రూ.1,480 కోట్లు చెల్లించామని చెప్పుకొచ్చారు. 27 నెలల్లో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు చెల్లించామని ఆయన వివరించారు. పేదలకు అన్యాయం జరుగుతోందని విపక్షాలు అపోహలు సృష్టిస్తున్నాయని.. బీఆర్ఎస్ గత ప్రభుత్వంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఎలా దుర్వినియోగం చేశారో అందరికీ తెలుసంటూ విమర్శించారు. ఎవరి పీఏలు సీఎం రిలీఫ్ ఫండ్ కాజేశారో కూడా తెలుసంటూ చురకలు అంటించారు. గత ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్ నిధులను కొందరు తమ సొంత ఖాతాల్లో వేసుకున్నారని, దీనిపై విచారణ జరుగుతోందన్నారు. త్వరలోనే అన్నీ బయటకు వస్తాయని హెచ్చరించారు. తాము అధికారంలోకి వచ్చాక 27 నెలల్లో రూ.2,046 కోట్ల సీఎంఆర్ఎఫ్ కింద ఇచ్చామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అప్పుల భారాన్ని తమకు వారసత్వంగా ఇచ్చిందని, ఆ బకాయిలను ..మిగతా 2లో

## నేడు సీఎంలతో మోడీ సమావేశం

#### వర్చువల్ ద్వారా జరగనున్న భేటీ

#### పశ్చిమాసియా స్థితిగతులపై చర్చించే ఛాన్స్

#### ఏ పరిస్థితినైనా ఎదుర్కోవాలంటూ ఇటీవల వ్యాఖ్య

#### మోడీ ప్రసంగంపై దేశ ప్రజలు ఆసక్తి



2లో..

## కవిత కొత్త పార్టీ తెలంగాణ ప్రజా జాగృతి

#### నేడు నిజామాబాద్ వేదికగా ప్రకటన

#### రాజకీయ నిర్ణయాలు ప్రకటించే అవకాశం

2లో..



# పెట్రోల్, డీజిల్ కొరత లేదు

**మొదటి పేజీ తరువాయి...**

సూచించామని, ప్రతి పౌరునికి నిరంతరాయ ఇంధన లభ్యతను నిర్ధారించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొంది. పెట్రోలియం శుద్ధిలో ప్రపంచవ్యాప్తంగా భారత్ 4వ స్థానంలో ఉంది. అలాగే ఎగుమతి చేసే దేశాల్లో 5వ స్థానంలో ఉంది. దీంతో దేశీయంగా పెట్రోల్, డీజిల్ నిల్వలు, లభ్యత పటిష్టంగా ఉన్నాయని, సరఫరాలో రేషన్ చేయమని ఏ రిటైల్ కేంద్రాలకు ఆదేశాలు ఇవ్వలేదని కేంద్రం తెలిపింది. ఇంధన కొరత వల్ల కొన్ని దేశాలు జాతీయ ఇంధన అత్యవసర పరిస్థితి ప్రకటించాయని, దేశంలో అటువంటి చర్యల అవసరం ఏమాత్రం లేదని తెలిపింది. ఇతర దేశాల్లో పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లపై పరిమితులు విధిస్తున్నప్పటికీ.. దేశంలో అలాంటి పరిస్థితి రాదని తెలిపింది. కొన్ని పెట్రోల్ బంక్‌ల వద్ద భయాందోళనతో ప్రజలు కొనుగోలు చేస్తున్నప్పటికీ.. సోషల్ మీడియాలో ఉద్దేశపూర్వకంగా వ్యాప్తి చేసిన తప్పుడు సమాచారం వల్ల




అలా జరుగుతున్నాయని స్పష్టం చేసింది. వినియోగదారులకు ఇంధనం నిరంతరం అందించేందుకు పెట్రోల్ బంక్‌లు పనిచేస్తున్నాయంది. కొరత లేకుండా చూసేందుకు బంక్‌లకు గతంలో అనుమతించిన ఒక రోజు క్రెడిట్‌ను మూడు రోజులకు పెంచడానికి కంపెనీలు చర్యలు తీసుకున్నట్లు కేంద్రం పేర్కొంది. "కేవలం 6 రోజులకు సరిపడ ఇంధన నిల్వలు మాత్రమే ఉన్నాయని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. భారత్‌లో మొత్తం 74 రోజులకు సరిపడ రిజర్వ్ సామర్థ్యం ఉంది. వాస్తవ నిల్వ కవరేజ్ సుమారు 60 రోజులు ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి పరిస్థితులు ఉన్నా.. రెండు నెలలకు సరిపడ సరఫరా అందుబాటులో ఉంది. ఎల్పీజీ కొరత లేదు. దేశంలో రిఫైనరీల్లో ఉత్పత్తి 40 శాతం పెరిగింది. దిగుమతి చేసుకోవాల్సిన గ్యాస్ కంటే ఎక్కువ ఉత్పత్తి జరుగుతుంది. అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా, ఇతర దేశాల నుంచి 800 టీఎంటీలతో కూడిన ఎల్పీజీ కార్గోలు దిగుమతికి సిద్ధంగా ఉన్నాయి. అదనను కొనుగోళ్లు నిరంతరం కొనసాగుతున్నాయి. ప్రతీ రోజు 50 లక్షలకుపైగా సిలిండర్లను సరఫరా చేస్తున్నాం. వాణిజ్య సిలిండర్ల కేటాయింపును 50 శాతానికి పెంచాం" అని పెట్రోలియం శాఖ స్పష్టం చేసింది.

# కవిత కొత్త పార్టీ తెలంగాణ ప్రజా జాగృతి

### నేడు నిజామాబాద్ వేదికగా ప్రకటన

### రాజకీయ నిర్ణయాలు ప్రకటించే అవకాశం

**నిజామాబాద్, మార్చి 26 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తూ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తన సొంత రాజకీయ పార్టీని ప్రకటించేందుకు సిద్ధమయ్యారు. తన రాజకీయ ప్రస్థానానికి పునాది వేసిన నిజామాబాద్ వేదికగానే ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించబోతున్నారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిజామాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో నిర్వహించే అధికారిక సమావేశంలో 'తెలంగాణ ప్రజా జాగృతి' పేరుతో కొత్త పార్టీని ఆమె ప్రకటించనున్నారు. పార్టీ ఆవిర్భావ వేడుకల తేదీని కూడా అదే వేదిక నుంచి వెల్లడించేందుకు సర్వం సిద్ధమైంది. రాబోయే నెలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో పార్టీ జెండా, అజెండా , పార్టీ గుర్తును ప్రజల ముందుకు తీసుకురావాలని కవిత భావిస్తున్నారు. ఈ పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పెద్ద ఎత్తున చేరికలు ఉండేలా ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారు. కేవలం పార్టీ ప్రకటనకే పరిమితం కాకుండా, కవిత రాబోయే ఎన్నికల్లో ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారనే అంశంపై కూడా ఈ సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. గతంలో నిజామాబాద్ ఎంపీగా ఐదేళ్ల పాటు పనిచేసిన అనుభవం ఉండటంతో, అదే పార్లమెంట్ పరిధిలోని బోధన్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆమె బరిలోకి దిగుతారని రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. కవిత ఈ కొత్త ప్రస్థానాన్ని ప్రారంభించాలని నిర్ణయించుకోవడంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలలో ఒక్కసారిగా గుబులు మొదలైంది. ముఖ్యంగా బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ వంటి నేతలు కవిత నిర్ణయంతో ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. కవిత వెంట ఎంతమంది కీలక నేతలు నడుస్తారు, ఎంతమంది మాజీ ఎమ్మెల్యేలు ఆమె పార్టీలో చేరతారనేది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణలో మూడో ప్రత్యామ్నాయంగా ఎదిగే లక్ష్యంతో వస్తున్న ఈ కొత్త పార్టీ, భవిష్యత్తులో రాష్ట్ర రాజకీయ సమీకరణాలను ఏ విధంగా మారుస్తుందో వేచి చూడాలి.



# నేడు సీఎంలతో మోడీ సమావేశం

**న్యూఢిల్లీ, మార్చి 26 (ప్రభాత ఉదయం)**

ఇరాన్, ఇజ్రాయెల్–అమెరికా మధ్య యుద్ధం కొనసాగుతోంది.. గల్ఫ్‌లో పరిస్థి తులు మరింత ఉద్రిక్తంగా మారాయి.. దీంతో యుద్ధం ప్రభావం ప్రపంచమంతా కనిపిస్తోంది.. ముఖ్యంగా గ్యాస్, చమురు సరఫరా తగ్గడంతో పలు దేశాల్లో తీవ్ర ప్రభావం కనిపిస్తోంది.. ముఖ్యంగా భారత్ లో సైతం గ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరత కనిపిస్తోంది.. ఈ క్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. శుక్రవారం అన్ని రాష్ట్రాల సీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భేటీ కానున్నారు. పశ్చిమాసియా పరిస్థితులపై చర్చించనున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడనున్న ప్రధాని మోదీ.. పశ్చిమాసియా పరిస్థితులతోపాటు.. దేశంలో నెలకొన్న పరిస్థితులపై కూడా సీఎంలతో నేరుగా మాట్లాడనున్నారు. అయితే.. ఈ సమావేశంలో ప్రధాని మోదీ ఏం మాట్లాడనున్నారనేది ఉత్కంఠగా మారింది. కాగా.. పార్లమెంట్ సమావేశాల్లో ఇటీవల ప్రధాని మోదీ మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులతో దేశంలో ఇంధన కొరత నెలకొందని.. అయితే.. ఎలాంటి పరిస్థితులు వచ్చినా సిద్ధంగా ఉండాలని ప్రధాని మోదీ సూచించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు దీర్ఘకాలం కొనసాగే అవకాశం ఉందని.. దేశ ప్రజలు ఏ సవాలునైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ప్రధాని మోదీ రాజ్యసభలో ప్రసంగిస్తూ.. దేశప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఇంధన భద్రత, భారతీయుల రక్షణపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన మార్కెట్ అతలాకుతలమవుతోందని.. దేశంలో కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు. తాము గల్ఫ్ దేశాలు, అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ నాయకులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని.. చర్చలు, దౌత్యం ద్వారానే శాంతిని పునరుద్ధరించాలని భారత్ బలంగా నమ్ముతోందని.. అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

# ఇరాన్‌కు మరో ఎదురుదెబ్బ

### ఇజ్రాయిల్ దాడిలో

### నేవీ చీఫ్ అలీరెజా దుర్మరణం

**టెహ్రాన్, మార్చి 26 (ప్రభాత ఉదయం)**

ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్‌కు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నేవీ చీఫ్ అలీరెజా తంగ్సిరిని ప్రాణాలు కోల్పోయారు. ఈ మేరకు ఇజ్రాయెల్ ఓ ప్రకటన విడుదల చేసింది. ఇరాన్ తీర ప్రాంత నగరమైన బందర్ అబ్బాస్‌పై జరిపిన దాడుల్లో అలీరెజాతో పాటు మరికొందరు సీనియర్ నౌకాదళ కమాండర్లు మృతి చెందినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. అయితే ఈ విషయంపై ఇరాన్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటనా చేయలేదు. 2018 నుంచి అలీరెజా ఐఆర్‌జీసీ నేవీ చీఫ్ పదవిలో కొనసాగుతున్నారు. హోర్ముజ్ జలసంధి మూసివేతను ఆయనే పర్యవేక్షిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇరాన్–అమెరికా మధ్య ఒకవైపు చర్చలు జరుగుతుండగానే మరోవైపు దాడులు కూడా కొనసాగుతున్నాయి. పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ దాడులు కొనసాగిస్తోంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేస్తోంది. తాజాగా ఇజ్రాయెల్‌లోని కెఫర్ ఖాసీం ప్రాంతంలో ఐదుగురు, టెల్ అవీవ్‌లో ఇద్దరు గాయపడ్డారు. ఇజ్రాయెల్ సైనిక నియంత్రణ కేంద్రం, అణు మౌలిక సదుపాయలకు సంబంధించిన పరిశ్రమలపై దాడులు చేశామని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ప్రకటన చేసింది.



# పద్దులపై చర్చలకు బదులు గొప్పలా?

### మిషన్ భగీరథ పేరుతో డబ్బు దుబారా

### దీనిపై ఎక్కడికైనా వెళ్లి పరిశీలిద్దామా

### సభలో బిఆర్ఎస్ సభ్యుల తీరుపై మండిపడ్డ భట్టి

**హైదరాబాద్, మార్చి 26 (ప్రభాత ఉదయం)**

బీఆర్ఎస్ శాసనసభ్యులు పద్దులపై చర్చను పక్కనపెట్టి, గత పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వ పాలన గురించి గొప్పలు చెప్పుకోవడమే లక్ష్యంగా మాట్లాడుతున్నారని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క చురకలంటించారు.. ప్రజా సమస్యలపై చర్చించాల్సింది పోయి గత ప్రభుత్వం గొప్పలు చేసిందని చెప్పడానికి ప్రాధాన్యం ఇవ్వడం సిగ్గుచేటన్నారు. అసెంబ్లీలో మహిళా శిశు సంక్షేమం పంచాయతీరాజ్ పద్దులపై జరుగుతున్న చర్చ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. పెళ్లయి బిడ్డ సంకలోకి వచ్చినా కల్యాణ లక్ష్మి చెక్కు అందలేదు' అని ఎమ్మెల్యే సునీత చేసిన వ్యాఖ్యలు వాస్తవమైతే, ఆ ఆలస్యానికి గల కారణాలను ప్రభుత్వం ఖచ్చితంగా పరిశీలిస్తుందన్నారు. సాధారణంగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి జాప్యం జరగడం లేదు. ఒకవేళ ఎక్కడైనా ఆలస్యం జరిగితే అది ఎమ్మెల్యే సంతకం లేకపోవడం వల్లో, దరఖాస్తు చేయడంలో జాప్యం వల్లో లేదా సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లో జరిగి ఉండవచ్చు. దీనిపై పూర్తి వివరాలను సభ ముందు ఉంచుతాం అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రజలకు నీళ్లు ఇవ్వడం కోసం తెచ్చిందా? లేక పైపుల కంపెనీల ప్రయోజనం కోసం తెచ్చిందా అని అన్నారు. ఈ పథకం కోసం దాదాపు రూ. 40 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసి, లక్షా 23 వేల కిలోమీటర్ల మేర పైపులు వేశామని లెక్కలు చెప్పారు. కానీ ఎక్కడో దూరం నుంచి నీళ్లు తెచ్చి, ఫిల్టర్ చేసి పంపిణీ చేసే విధానం క్షేత్రస్థాయిలో ఎక్కడా సక్రమంగా అమలు కాలేదన్నారు. తెలంగాణలోని ఏ జిల్లాలో కూడా మిషన్ భగీరథ సక్రమంగా పనిచేయడం లేదు. ఎక్కడ చూసినా పైపుల లీకేజీలు, పగిలిన పైపులతో నీరు వృథా అవుతోంది కానీ ప్రజలకు మాత్రం అందడం లేదన్నారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల నుంచి ఎర్రుపాలెం వరకు వేసిన పైప్‌లైన్ ద్వారా సరిగ్గా నీరు అందిన పరిస్థితి లేదు. కేవలం లీకేజీలు, మరమ్మతులతోనే కాలం గడుస్తోంది. కొత్త పథకం పేరుతో స్థానిక నీటి వనరులను నిర్లక్ష్యం చేయడమే కాకుండా, అప్పటికే పనిచేస్తున్న పాత నీటి పథకాలకు తాళాలు వేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని మండిపడ్డారు. మిషన్ భగీరథ పనితీరుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సిద్ధమైతే ఒక కమిటీ వేద్దాం. ఊరూరా తిరిగి నీటి పంపిణీ ఎలా జరుగుతుందో, క్షేత్రస్థాయి వాస్తవాలు ఏంటో ప్రత్యక్షంగా పరిశీలిద్దాం అన్నారు. ప్రతిపక్ష నేతలు సభను, ముఖ్యమంత్రిని మరియు మంత్రులను గౌరవించి మాట్లాడాలి. సభా మర్యాదలను పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించడం అవసరం అని గుర్తు చేశారు.



# గత ప్రభుత్వం బకాయిలు కడుతున్నాం

**మొదటి పేజీ తరువాయి...**

తామే చెల్లిస్తున్నామని రేవంత్ రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్ గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కోసం నెలకు రూ.52 కోట్లు ఖర్చు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నెలకి రూ.89 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఆరోగ్య శ్రీ ఇవ్వకపోవడం వల్ల చికిత్స చేయట్లేదు అనేది అపోహ మాత్రమే అన్నారు. ఇన్ని ఇబ్బందుల్లో కూడా ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. విద్యా, వైద్యం విషయంలో కోతలు ఉండవని సీఎం రేవంత్ మరోసారి తేల్చి చెప్పారు. కోతలు పెట్టాల్సి వస్తే వేరే కోతలు పెడతామని అన్నారు. టీచింగ్ కాలేజీల నిర్వహణ గ్రూప్–1 అధికారులకు అప్పగిస్తామని, ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం తీసుకు వస్తున్నట్లు సీఎం రేవంత్ తెలిపారు.విద్య, పేదల వైద్యం తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యాంశాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వైద్యానికి నిధులు కేటాయించి రాష్ట్రాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో రూ.2,046 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశామని చెప్పారు. గతంలో ఈ చెక్కుల విషయంలో అవినీతి జరిగిందన్నారు. 27 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు చెల్లించామన్నారు. టీచింగ్ కాలేజీలకు రోగులు వెళ్లడం లేదని సీఎం అన్నారు. ఈ కాలేజీల నిర్వహణను గ్రూప్–1 అధికారులకు అప్పగిస్తామని చెప్పారు. ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం తీసుకొచ్చామని వివరించారు. విదేశాల్లో నిపుణులైన వైద్యుల సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. గోషామహల్‌లో 30 ఎకరాల్లో రూ.3వేల కోట్లతో ఉస్మానియా ఆస్పత్రి నిర్మిస్తున్నామన్నారు. ఆ పనులు వేగంగా జరిగేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తామన్నారు.

# దావోస్ పర్యటనలో రూ.2.19 లక్షల కోట్లు పెట్టుబడులు

**మొదటి పేజీ తరువాయి...**

కుదుర్చుకుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. రాష్ట్రానికి రూ. 2.19 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని అన్నారు. అసెంబ్లీలో దావోస్ పెట్టుబడులపై శ్రీధర్ బాబు మాట్లాడారు. పెట్టుబడులతో 68,150 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు వస్తాయని, 2024 దావోస్ లో 18 ఎంవొయూలు.. రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలియజేశారు. రూ.81,800 కోట్ల పెట్టుబడులతో 6 కంపెనీలకు భూముల కేటాయింపు జరిగిందని, భూముల కేటాయింపుతో ప్రభుత్వానికి రూ.1,540 కోట్ల ఆదాయం కేటాయించామని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మరో 3 కంపెనీలకు రూ.30 వేల కోట్ల పెట్టుబడుల కోసం భూముల గుర్తింపు చర్యలు చేశామని, నిజామాబాద్ ఐటీ టవర్ లో 11 కంపెనీలు కార్యకలాపాలు జరిగాయని అన్నారు. నిజామాబాద్ లో 681 సీట్ల సామర్థ్యంతో ఐటి టవర్ నిర్మించామని, నిజామాబాద్ ఐటీ టవర్ లో ప్రస్తుతం 276 మంది ఉద్యోగాలు పనిచేస్తున్నారని అన్నారు. పెట్టుబడుల ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేస్తామని, పరిశ్రమల ఏర్పాటు వల్ల రాష్ట్రానికి బహుళ ప్రయోజనాలు, ఉపాధి లభిస్తుందని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

# ఇరాన్‌కు మరోమారు ట్రంప్ వార్నింగ్

**న్యూఢిల్లీ, మార్చి 26 (ప్రభాత ఉదయం)**

ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. ఒప్పందం విషయంలో మరీ ఆలస్యం చేస్తే పరిస్థితులు తీవ్రంగా మారిపోతాయని హెచ్చరించారు. అమెరికాతో ఒప్పందం కోసం ఒకవైపు ప్రయత్నిస్తూనే, బయటకు మరోలా మాట్లాడుతోందని ఇరాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరీ ఆలస్యం కాకముందే సీరియస్‌గా వ్యవహరించడం మంచిదని హితవు పలికారు.'ఇరాన్ మిలిటరీ పూర్తిగా నాశనమైంది. తిరిగి పుంజుకునే అవకాశం లేదు. దీంతో వారు ఒక ఒప్పందం కోసం మమ్మల్ని వేడుకుంటున్నారు. మరోవైపు మా ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని చెబుతున్నారు. వారు చాలా తప్పు చేస్తున్నారు. మరీ ఆలస్యం కాకముందే వారు ఒక నిర్ణయం తీసుకుంటే మంచిది. ఆలస్యమైతే వెనక్కి తిరిగి చూసే ప్రసక్తే లేదు. పరిస్థితులు తీవ్రంగా ఉంటాయి' అని తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ ద్వారా హెచ్చరించారు. అమెరికాతో చర్చల పట్ల ఇరాన్ భిన్నంగా ప్రకటనలు చేస్తోంది (ఎసజీని జా ఇనీన్గా÷తిఇఃబి). ఘర్షణలు ముగించేందుకు చర్చలు జరిపే ఉద్దేశం ఉద్దేశం తమకు లేదని, అమెరికా ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని ఇరాన్ విదేశాంగ మంత్రి వ్యాఖ్యానించారు. అమెరికాతో చర్చలు జరుగుతున్న సమయంలో పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ దాడులకు పాల్పడుతోంది.

# కడియం, సంజయ్‌లపై విచారణ

### విచారణ ఏప్రిల్ 16కు వాయిదా

**హైదరాబాద్, మార్చి 26 (ప్రభాత ఉదయం)**

పార్టీ మారలేదని పేర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, సంజయ్‌ల వ్యవహారంపై హైకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో ఇద్దరు ఎమ్మెల్యేలతో పాటు అసెంబ్లీ స్పీకర్‌కు కోర్టు నోటీసులు జారీ చేసింది. ఇటీవల కడియం శ్రీహరి, సంజయ్ పార్టీ మారలేదని అసెంబ్లీ స్పీకర్ తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే.అయితే, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్వర్ రెడ్డి, కెపి వివేకానంద స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో కడియం శ్రీహరి, సంజయ్‌లకు కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు ఆదేశించింది. ఇప్పటికే ఈ వ్యవహారం రాజకీయంగా చర్చనీయాంశంగా మారగా, కోర్టు విచారణపై అన్ని వర్గాల్లో ఆసక్తి నెలకొంది. తదుపరి విచారణను వచ్చే నెల 16వ తేదీకి వాయిదా వేసింది.

# చైతన్య విల్లాస్ కాలనీ శ్రీరామాలయంలో పసుపు దంచు కార్యక్రమం

## కళ్యాణ అక్షింతల, గోరింటాకు పండుగ కార్యక్రమం






అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని ఉప్పరపల్లి హనుమత్ సేవిత శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. గురువారం కళ్యాణ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సీతారాములను వధూవరులుగా ముస్తాబు చేయటం,మేళతాళాలతో ఊరేగింపు, పసుపు దంచటం,తలంబ్రాల బియ్యం కలపటం,గోరింట ఉత్సవం కన్నుల పండువగా జరిగాయి. ఆలయ శ్రీరామనవమి వేడుకల అడ్ హక్ కమిటీ ప్రతినిధులు జోషి, ఆదర్శ్, శుక్లా, పద్మశ్రీ, వనితా రెడ్డి ,స్వప్న నేతృత్వంలో కార్యక్రమాల ఏర్పాట్లు చేస్తున్నారు.కాలనీ ప్రతినిధులు వేణుగోపాల్, రమణాచారి దంపతులు పెళ్ళికొడుకు కార్యక్రమం నిర్వహించారు.

రాజేంద్రనగర్, మార్చి26 (ప్రభాత ఉదయం)






టి ప్రకాష్ గౌడ్

# రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని ఒకే కమిషనరేట్ పరిధిలోకి తీసుకురావాలి

### ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

బుద్వేల్, మార్చి 26 (ప్రభాత ఉదయం)

రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని సైబరాబాద్ లేదా ఫ్యూచర్ సిటీ పరిధిలోకి తీసుకురావాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ ప్రకాశ్ గౌడ్ కోరారు. గురువారం అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. జీహెచ్ఎంసీ పునర్వ్యవస్థీకరణ లో బాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని కొంత బాగాన్ని సైబరాబాద్, మరి కొంత బాగాన్ని హైదరాబాద్, ఇంకొంత బాగాన్ని ఫ్యూచర్ సిటీ లో కలి పారని ఆవేధన వ్యక్తం చేశారు. తనను సంప్రదించకుండానే ఈ విదంగా మార్చారన్నారు. దీని వల్ల పాలన పరమైన ఇబ్బందులు వస్తాయన్నారు. నియోజకవర్గం ప్రాంతం మూడు వేర్వేరు కమిషనరేట్ల పరిధిలోకి రావడంతో ప్రజలకు కూడా తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. పోలీసు యంత్రాంగ మధ్య సమన్వయం కూడా లేకుండా పోతుందన్నారు. ప్రజల సౌకర్యార్థం రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని సైబరాబాద్ లేదా ఫ్యూచర్ సిటీ లోకి తీసుకురావాలన్నారు.




శిక్షణలో పాల్గొన్న రైతులు

# పశుపోషణలో ఆధునిక పద్దతులు పాటించాలి

బుద్వేల్, మార్చి 26 (ప్రభాత ఉదయం)

పశు పోషకులు ఆధునిక పోషణ పద్దతులను అవలంభిం చడం ద్వారా అధిక లాభాలను పొందవచ్చని రాజేంద్రనగర్ పశువైద్య కళాశాల పోషణ విభాగాధిపతి డాక్టర్ డి నాగలక్ష్మీ అన్నారు. పీవీ నర్సింహ్మారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం లోని రాజేం ద్రనగర్ పశువైద్య కళాశాల పశుపోషణ విభాగం, భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) జాతీయ మాంస పరిశోధన స్థానం ఆధ్వర్యంలో షెడ్యుల్డు కులాల రైతులకు అధిక పాల ఉత్పత్తి, పునరుత్పత్తి సామార్థ్యం కోసం పోషణలో మెలకువలు అనే అంశంపై గురువారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి మాధురి చేతుల మీదుగా పశుపోషణలో ఉపయోగపడే మెళకువలు ఉన్న పుస్తకాలను శిక్షణ లో పాల్గొన్న వారికి అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ కి చెందిన డాక్టర్ నళిని కుమారి, డాక్టర్ జె నర్సింహ్మ, డాక్టర్ అలెగ్జాండర్, డాక్టర్ ఎ సుధీరాబాబు, డాక్టర్ రామక్రిష్ణ, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ మేనేజరు జి రత్నాకర్తో పాటు జనగామ, రంగారెడ్డి జిల్లాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.



ఆక్రమణల తొలగింపు

# ఆరాంఘర్ నుంచి దుర్గానగర్ మార్గంలో పుట్ పాత్ ఆక్రమణల తొలగింపు

బుద్వేల్, మార్చి 26 (ప్రభాత ఉదయం)

ప్రజా పాలన - పట్టణ ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో బాగంగా గురువారం ఆరాంఘర్ చౌరస్తా నుంచి దుర్గానగర్ చౌరస్తా వరకు రోడ్డు కు ఇరువైపుల ఉన్న అక్రమ నిర్మాణాలను అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వి సమ్మయ్య పర్యవేక్షణలో టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు తొలగించారు. పాదచారులు నడిచే మార్గంలో దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. అందుకే ఆక్రమణలను తొలగించామన్నారు. మైలార్దేవుపల్లి ను ంచి పల్లెచెరువు వరకు, గగన్పహడ్ ఓల్డ్ కర్నూల్ రోడ్డు వరకు కూడా దశలవారిగా పుట్ పాత్ ఆక్రమణలను తొలగిస్తామని డిప్యూటీ కమిషనర్ వి సమ్మయ్య తెలిపారు.



రాజేంద్రనగర్ కోర్టు ఆవరణలో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి

# కస్టడీ ముగియంతో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డిని రాజేంద్రనగర్ కోర్టులో హాజరు పరిచిన పోలీసులు

బుద్వేల్, మార్చి 26 (ప్రభాత ఉదయం)

మొయినాబాద్ ఫామ్ హౌజ్ డ్రగ్స్ కేసులో పోలీసు కస్టడీ లో ఉన్న మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి తో పాటు అతని సోదరుడు రితేశ్ రెడ్డి, డిల్లీ కి చెందిన నామిత్ శర్మ ల మూడు రోజుల కస్టడీ ముగియడంతో గురువారం సాయంత్రం 4:30 గంటలకు సిట్ పోలీసులు వారిని రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపరిచారు. 12వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ముందు వారిని ప్రవేశ పెట్టగా, న్యాయమూర్తి ఆదేశాలతో వారు ముగ్గురిని తిరిగి చం చల్గూడ జైలుకు తరలించారు.

**మరో ఐదు రోజుల కస్టడీ కోరుతు పోలీసుల పిటిషన్, తిరస్కరించిన న్యాయమూర్తి :**

డ్రగ్స్ కేసులో అరెస్టయిన మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి తో పాటు మరో ఇద్దరిని అదనంగా మరో ఐదు రోజుల కస్టడీ కి ఇవ్వాలని పోలీసులు న్యాయమూర్తిని కోరగా ఆమె తిరస్కరించినట్లు న్యాయవాది శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఆయన మీడియా తో మాట్లాడుతూ, పోలీసులు పైలట్ రోహిత్రెడ్డిఅరెస్ట్ చేసిన సమయంలో 24 గంటల పాటు విచారించి కోర్టులో హజరుపరిచారన్నారు. ఈ విషయాన్ని కోర్టు గమనించిందన్నారు. 14 రోజుల రిమాండ్ లో ఉన్న పైలట్ రోహిత్ రెడ్డి తో పాటు మరో ఇద్దరిని 10రోజుల పాటు కస్టడీ కి ఇవ్వాలని కోరగా, న్యాయమూర్తి మూడు రోజుల పాటు గతంలో కస్టడీ కి ఇస్తు ఆర్డర్ ఇచ్చారన్నారు. అది కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకు మాత్రమే విచారణ చేయాలని ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. కస్టడీ ముగిసిన తర్వాత తిరిగి గురువారం మరో ఐదు రోజులు కస్టడీ కి ఇవ్వాలని కోరగా దానికి న్యాయమూర్తి ఒప్పుకోలేదని న్యాయవాది శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి కస్టడీ కి తీసుకువచ్చిన సమయంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. శం షాబాద్ రూరల్ ఇన్స్పెక్టర్, మొయినాబాద్, షాబాద్ ఇన్స్పెక్టర్లు, పోలీసు నిబ్బంది బందోబస్తు లో పాల్గొన్నారు.



దివంగత ధర్మ భిక్షం చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

# ధర్మభిక్షం గొప్ప నాయకులు

బుద్వేల్, మార్చి 26 (ప్రభాత ఉదయం)

స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ పార్లమెంటు సభ్యులు, గీత పనివాళ్ల సంఘం జాతీయ అధ్యక్షులు దివంగత ధర్మభిక్షం గొప్ప నాయకులని సీపీఐ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు జై ఆనంద్ గౌడ్, రాజేంద్రనగర్ మండల సహాయ కార్యదర్శి జె విజయానంద్ గౌడ్ లు అన్నారు. కామ్రేడ్ ధర్మభిక్షం 15వ వర్ధంతి ని గురువారం మైలార్ దేవుపల్లి లో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మభిక్షం సేవలను గుర్తు చేసుకున్నారు. గ్రామాలలో గీత పనివారలకు ఐదెరకాల భూమి కేటాయించి ఈత, తాటి వనాలను పెంచడానికి ప్రభుత్వం తోడ్పాటునందించాలన్నారు. గీత కార్మికులకు వృద్ధాప్య పించనును 50 సంవత్సరాలకే ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు జె సదానందంగౌడ్, కె మధు, జే తేజుగౌడ్, జె రిత్విక్ గౌడ్, సత్యనారాయణ, బబ్లు, హర్ష, తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి ని కలసి మహనీయుల జయంతి ఉత్సవాల కు రావాలని ఆహ్వానిస్తున్న దళిత సంఘాల నాయకులు

# రాజేంద్రనగర్‌లో మహనీయుల జయంతి ఉత్సవాలకు గొప్ప చరిత్ర

బుద్వేల్, మార్చి 26 (ప్రభాత ఉదయం)

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు ఘన చరిత్ర ఉందని, దానిని ఉత్సవాల కమిటీ నిర్వాహకులు జాతి ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి అన్నారు. రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలలో ఏప్రిల్ మాసంలో నిర్వహించే మహనీయుల జయంతి వేడుకలకు ఆహ్యానించడానికి గురువారం శ్రీనగర్ లోని ఆమె నివాసానికి వెళ్లిన జయంతి ఉత్సవాల నిర్వాహకులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో ఉత్సవాల కమిటీ అధ్యక్షురాలుగా ఎ సదాలక్ష్మీ సంప్రదించి అధికారికంగా మహనీయుల జయంతి ఉత్సవాలను నిర్వహించాలని కోరితే అప్పటి నుంచి అధికారికంగా ఉత్సవాలకు నిధులు మంజూరు చేయించే విదంగా కార్యచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు. సబితా ఇంద్రారెడ్డిని కలసిన వారిలో ఉత్సవాల కమిటీ చైర్మన్ దాసరి రమేశ్, కో చైర్మన్ నందిగామ నర్సింహ్మ, ప్రధాన కార్యదర్శి మంగలారం శ్రీనివాస్, కోశాధికారి పలుగుచెరువు మహేందర్, జయంతి ఉత్సవాల కమిటీ పూర్వ అధ్యక్షులు పి జీవన్ దాస్, పచ్చ శ్రీనివాసులు, పచ్చ నర్సింగరావు, పంబాల రాజు, ఎడ్లకాడి సూర్యం, నాయకులు ఆదిరాల రవి కుమార్. ఎడ్లకాడి చంద్రశేఖర్. పత్యార నర్జింహ్మ, నోముల రాము యాదవ్, గోల్కొండ లేవిరాజ్, మన్నె శేఖర్, బీఆర్ సుమన్, కప్పగూడెం గౌతమ్, జనార్ధన్. సాయిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

# భార్య ఇంటికి రావడం లేదని భర్త ఆత్మహత్య

బుద్వేల్, మార్చి 26 (ప్రభాత ఉదయం)



: ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య ఇంటికి రావడం లేదని మనస్తాపానికి గురైన భర్త గురువారం ప్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలను మైలార్దేవుపల్లి పోలీసులు వెల్లడించారు. కర్ణాటక కు చెందిన సౌందర్య, మహరాష్ట్ర లాతూర్ కు చెందిన విజయ్ (30) లు మూడు సంవత్సరాల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. రెండు సంవత్సరాలు మహరాష్ట్రలో ఉండి సంవత్సరం క్రితం కాటేదాన్ కు మకాం మార్చారు. విజయ్ లారీ డ్రైవర్గా పనిచేస్తుం డగా, సౌందర్య కాటేదాన్ పారిశ్రామిక వాడలో దినసరి కూలిగా పనిచేస్తుంది. విజయ్ ఈ మధ్య కాలం లో బార్యపై అనుమానం పెంచుకుని వేధించసాగాడు. దీంతో సౌందర్య ఆరాంఘర్ లో ఉండే స్వంత బంధువుల ఇంటికి వెళ్లింది. విజయ్ భార్య దగ్గరకు వెళ్లి ఎంత బతిమాలిన ఆమె ఇంటికి రాలేదు. దీంతో కాటేదాన్ లోని ఇంటికి వెళ్లిన విజయ్ చీర తో ప్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన ఇంటి యజమాని భార్యకు సమాచారం ఇచ్చాడు. ఆమె వచ్చి మైలార్దేవుపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి విజయ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పెద్దపల్లి గ్రామంలో పోలీస్ పికెట్..??

## శ్రీరాములోరి పెళ్లి సందర్భంగా నెలకొన్న రగడ

## జిల్లా స్థాయి అధికారుల వద్దకు వెళ్లిన తెగని పంచాయతీ

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 26(ప్రభాత ఉదయం)**



భక్తితో జరుపుకోవాల్సిన శ్రీ సీతారాముల కల్యాణం.. చివరకు కుర్చీలాటగా మారింది. మల్దకల్ మండలం పెద్దపల్లి గ్రామంలో తాజా మరియు మాజీ సర్పంచ్‌ల మధ్య తలెత్తిన వివాదం గ్రామస్తులను విస్మయానికి గురి చేస్తోంది. శుక్రవారం జరగనున్న శ్రీసీతారాముల కళ్యాణోత్సవ నిర్వహణ విషయంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ పవిత్ర కార్యక్రమాన్ని తమ ఆధ్వర్యంలోనే నిర్వహించాలంటూ ప్రస్తుత సర్పంచ్ మరియు మాజీ సర్పంచ్ వర్గాల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వివాదం జరిగింది. ప్రతి సంవత్సరం గ్రామస్తులందరి సహకారంతో వైభవంగా జరిగే సీతారాముల కళ్యాణాన్ని ఈసారి కూడా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అయితే, ప్రోటోకాల్ ప్రకారం తమకే ప్రాధాన్యత ఉండాలని ప్రస్తుత సర్పంచ్ వర్గం వాదిస్తుండగా, గతంలో తామే ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించామని, అనుభవం ఉన్న తమకే పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని మాజీ సర్పంచ్ వర్గం పట్టుబట్టింది. ఇరువర్గాల మధ్య మాట మాట పెరగడంతో గ్రామంలో కాసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. దీంతో మల్దకల్ పోలీసులు రంగప్రవేశం చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా పోలీస్ ఫికెట్ ఏర్పాటు చేశారు. గ్రామంలో నెలకొన్న సమస్య ఉన్నతాదికారులకు పరస్పర ఫిర్యాదులు చేశారు. సమస్యను శాంతియుతంగా పరిస్కరించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. సాధారణంగా గ్రామాల్లో శ్రీసీతారాముల కళ్యాణం వంటి పవిత్రమైన కార్యక్రమాలను ఊరి పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించడం ఆనవాయితీ. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో వివాదాలు జరగడం వల్ల గ్రామ వాతావరణం దెబ్బతినడమే కాకుండా, భక్తుల మనోభావాలు కూడా దెబ్బతింటాయి. పోలీసులు లేదా స్థానిక అధికారులు జోక్యం చేసుకోవాలని డిమాండ్. సామరస్యంగా ముగించడం శ్రేయస్కరం.స్వామివారి కళ్యాణం అనేది ఊరి క్షేమం కోసం చేసేది. అక్కడ "నేను" అనే అహంకారం కంటే "మనం" అనే సమిష్టి తత్వం ముఖ్యం అని ఇరువర్గాలకు నచ్చజెప్పి పెద్దమనుషులు మధ్యవర్తిత్వం వహించడం ఉత్తమం అని భక్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



## విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### పటాన్ చెరు డివిజన్ విద్యుత్ కార్మికుల జెఎసి అధ్యక్షులు భూపాల్ రెడ్డి

### టీ.వీ.ఏ.ఈ .జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె

**పటాన్ చెరు, మార్చి 26 (ప్రభాత ఉదయం):**

విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై గురువారం పటాన్చెరు డివిజన్ కార్యాలయం ఎదుట రాష్ట్ర విద్యుత్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఆర్టిజన్ కార్మికులకు ప్రభుత్వం నిబంధన ప్రకారం ఏపీఎస్సిబి రూల్స్ వర్తింపజేయాలని, సమాన పనికి సమాన వేతనం అందజేయాలని,ఆర్టిజన్ కార్మికులను విద్యార్హతను బట్టి కన్వర్షన్ చేయాలని, మీటర్ రీడింగ్ వర్కర్లను, పోల్ టు పోల్ వర్కర్లను ఎఫ్ ఓ సి వర్కర్లను కూడా విద్యుత్ సంస్థలో విలీనం చేసుకోవాలని పటాన్చెరు డివిజన్ విద్యుత్ కార్మికుల జెఎసి అధ్యక్షులు భూపాల్ రెడ్డి పర్వయ్య ,కార్యదర్శి రఘు డిమాండ్ చేశారు. కార్మికులకు మద్దతుగా సంగారెడ్డి జిల్లా విద్యుత్ కార్మికుల బీసీ వెల్ఫేర్ అసోసియేషన్, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ధర్నా కార్యక్రమానికి సంఘీభావం తెలిపారు. అనంతరం యాజమాన్యం ప్రభుత్వం విద్యుత్ కార్మికుల న్యాయమైన హక్కులు ఇవ్వడానికి వెనుకడుగు వేయొద్దని,24 గంటలు కుటుంబాలకు దూరంగా ఉంటూ సుదూర ప్రాంతాల నుండి వచ్చి విద్యుత్ సరఫరా లో అంతరాయం లేకుండా పని చేస్తున్న కార్మికులకు ఎపిఎస్ఇబి రూల్స్ వర్తింప జేయాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు గోపి,సాయి గౌడ్, శ్రీకాంత్,శ్రీశైలం,విష్ణు,సర్వేశ్, సుధాకర్ రమేష్,శివ రవీందర్,లక్ష్మీబాయి,శివలిల, కవిత తదితరులు పాల్గొన్నారు.



## కూరగాయ రైతులకు ప్రత్యేక గుర్తింపు

### ఉద్యాన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాష

**హైదరాబాద్, మార్చి 26 (ప్రభాత ఉదయం)**

కూరగాయ రైతులను ప్రత్యేకంగా ప్రోత్సహించేందుకు కూరగాయల కిసాన్ ఐడి కార్డులు ఇస్తామని, తద్వారా వారికి లోన్లు, ప్రత్యేక మార్కెటింగ్ సాధ్యమని రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీమతి షేక్ యాస్మిన్ భాష తెలిపారు. ప్రతి సంవత్సరం 50 ఎకరాల్లో కూరగాయలు విస్తీర్ణం పెంచేందుకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆమె అన్నారు. రాష్ట్రంలో కూరగాయ సాగును భారీగా ప్రోత్సహించడానికి కూరగాయలకే 215 కోట్ల రూపాయల బడ్జెట్ ప్రతిపాదించినట్లు తెలిపారు. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయం, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల నుండి ఎంపిక చేసిన ఏడు జిల్లాల రైతు కూరగాయల రైతు వాలంటీర్లకు కూరగాయల సాగుపై ఏర్పాటు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 50 శాతం సబ్సిడీతో కూరగాయలు పందిర్లు, ఇతర ప్రధాన పనిముట్లు ఆర్ కె వి వై, ఎమ్ ఐ డి హెచ్ పథకాల కింద ఇస్తున్నట్లు తెలిపారు. యాంత్రికరణ కింద మినీ ట్రాక్టర్లు, పసుపు తవ్వే యంత్రాలు, బాయిలర్లు కలిపి మొత్తం 17 రకాల పరికరాలకు సబ్సిడీలు ఉన్నట్లు తెలిపారు. 2014-15 సంవత్సరాలలో 3 లక్షల ఎకరాల్లో ఉన్న కూరగాయల సాగు వివిధ కారణాలతో లక్ష ఎకరాలకు పడిపోయిందని, మళ్లీ ఆ మేర విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి కట్టుబడి ఉందన్నారు. ఇతర రాష్ట్రాల నుండి కూరగాయలు దిగుమతి చేసుకొని వాడుకోవడం బాధగా ఉందని తెలిపారు. పంట మార్పిడి క్రింద కూరగాయలు, పప్పు దినుసులు వేసుకోవాలని తెలిపారు. సంవత్సరానికి 50,000 ఎకరాలతో, ఐదు సంవత్సరాలలో రెండున్నర లక్షల ఎకరాలతో కూరగాయల సాగు చేపట్టాలని తెలిపారు. రైతులు నమ్మకమైన రిజిస్టర్డ్ నర్సరీ నుంచి కూరగాయల నారు తీసుకోవాలని, అలాగే నిబంధనలు పాటించని నర్సరీలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు. అంటు కూరగాయ మొక్కలు రైతులే స్వయంగా తయారు చేసుకునేందుకు అవసరమైన శిక్షణ యువ రైతులకు ఇస్తామన్నారు. విజయపథంలో ఉన్న రైతుల అనుభవాలు ప్రత్యక్షంగా చూసి నేర్చుకోవడానికి రైతులకు ఎక్స్పోజర్ విసిట్లు ఏర్పాటు చేస్తామని, బెంగళూరులోని ఐ హెచ్ ఆర్, బారామతిలోని మోడల్ సంస్థలకు రైతులను తీసుకెళ్తామన్నారు. పురుగుమందు అవశేషాలు లేని కూరగాయల పండించడం, పామ్ ఆయిల్ తోటల్లో అంతర పంటలుగా రైతులు కూరగాయలు కూరగాయలు వేసుకోవాలని సూచించారు. తక్కువ ఉత్పత్తి ఖర్చుతో, అధిక దిగుబడి పొందే పద్ధతులు, మల్టీ లేయర్ ఫామింగ్ పై రైతుల దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం నుంచి కోతుల బెడదను తగ్గించేందుకు సోలార్ ఫెన్సింగ్, ఆటోమేటెడ్ యంత్రాలు, టెక్నాలజీస్ ఎంత మంది రైతులకైనా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. సమగ్ర పురుగు, పోషక యాజమాన్యాలు రైతులు పాటిస్తే ఖర్చు తగ్గడంతో పాటు రసాయన అవశేషాలు లేని కూరగాయల ఉత్పత్తి సాధ్యమని ఉద్యాన శాఖ డైరెక్టర్ తెలిపారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండా రాజిరెడ్డి మాట్లాడుతూ రైతులే స్థానికంగా అందుబాటులో ఉన్న వనరులు ఉపయోగించి సేంద్రియ ఎరువులు తయారు చేసుకుని వాడితే పంట ఖర్చులు తగ్గించుకోవచ్చు అన్నారు. పంటలను దశలవారీగా మార్కెట్ కు అనుగుణంగా సాగు చేసుకుంటే కూరగాయల్లో ఉన్నంత లాభం వేరే పంటలలో ఉండదని తెలిపారు.కార్యక్రమంలో విస్తరణ సంచాలకు లు టి. సురేష్, కూరగాయల పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ అనిత కుమారి, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి. ప్రశాంత్, ఉద్యాన శాఖ జెడిఎ పద్మనాభ, ప్రొఫెసర్ పిడిగం సైదయ్య, అశ్విన్, శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా దుర్యోధన బాబు జన్మదిన వేడుకలు

### శుభాకాంక్షలు తెలిపిన రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి

**కూకట్ పల్లి, మార్చి 26 (ప్రభాత ఉదయం)**

శేరిలింగంపల్లి నియోజకవర్గం, వివేకానంద నగర్ డివిజన్ పరిధిలో గల రామకృష్ణ నగర్ లో దుర్యోధన బాబు జన్మదిన సందర్భంగా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురంధర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని బాబుతో కేకు కట్ చేయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పురేందర్ రెడ్డి మాట్లాడుతూ బాబు సుమారు ఐదు సంవత్సరాల నుంచి కాలనీలో ఒక కార్మికుడిగా పని చేస్తూ అందరితో కలిసి మెలిసి ఎంతో సరదాగా ఉండే ఒక కార్మికుడు అయినటువంటి బాబు జన్మదిన జరుపుకోవడం ఎంతో సంతోషంగా సరదాగా ఉందని ఆయన అన్నారు. బాబు నిండు నూరేళ్లు జన్మదిన వేడుకలు జరుపుకోవాలని బాబుకు అష్ట ఐశ్వర్యాలు ఆరోగ్యంతో ఎల్లప్పుడూ ఉండాలని ఆ భగవంతుని కోరుచున్నాను. ఈ కార్యక్రమంలో జి ప్రసాద్, ఎస్ శ్రీధర్, సి కె రెడ్డి, సాయి, నాగేశ్వరరావు, తాండవ కృష్ణ, కృష్ణవేణి తదితరులు పాల్గొని దుర్యోధన బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.




## బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు తప్పవు

### ఉప కమీషనర్ చాముండేశ్వరి

**కూకట్ పల్లి, మార్చి 26 (ప్రభాత ఉదయం)**

పరిసిరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆల్విన్ కాలనీ సర్కిల్ ఉప కమిషనర్ చాముండేశ్వరి తెలిపారు. సర్కిల్ పరిధిలోని వెంకటేశ్వర నగర్ డివిజన్ పాపిరెడ్డి నగర్ లో బస్తి అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి తో కలసి పర్యటించిన చాముండేశ్వరి నిత్యం ఇంట్లో పేరుకుపోతున్న చెత్తను, చెత్త తరలించే కార్మికుల రిక్షాల్లో మాత్రమే వేయాలని సూచించారు. రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తూ పారిశుధ్య సమస్యకు కరణమవుతున్న వారిని గుర్తించి వారిపట్ల చర్యలు, అదే విధంగా భారీ జరిమానా విధిస్తామని ఉప కమిషనర్ హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు హన్మంత్ రావు, ఎస్ఆర్పి చైతన్య, రాములు, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాజీ సర్పంచ్, బీ ఆర్ ఎస్ నాయకులు పి దర్శన్ కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న మిత్రులు

## అందమైన ఇల్లు నిర్మించుకున్న మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకులు దర్శన్ కుటుంబ సభ్యులకు అభినందనలు

**శంషాబాద్, మార్చి 26 (ప్రభాత ఉదయం)**

షాబాద్ మండలం హైతాబాద్ మాజీ సర్పంచ్, బీ ఆర్ ఎస్ నాయకులు పి.దర్శన్ , పి కళ, కూతురు రుత్విక, కుమారుడు అభినవ్ లు శంషాబాద్ లో నిర్మించిన ఇల్లు గృహ ప్రవేశ కార్యక్రమం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు ఈ కార్యక్రమంలో పాల్గొని దర్శన్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. గృహ ప్రవేశ కార్యక్రమం లో సోలిపేట గ్రామ మాజీ సర్పంచ్ నర్సింగ్ రావు, తెలంగాణ సామాజిక విద్యార్థి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల లక్ష్మి నివాస్, రాజేంద్రనగర్ కు చెందిన పాస్టర్లు రెవరెండ్ కె సుందర్ పాల్, రెవరెండ్ సీ హెచ్ సునీల్ సామ్యూల్, పాస్టర్ బట్టు శ్రీకాంత్, జర్నలిస్ట్ అప్పారెడ్డి గూడెం భీమయ్య తో పాటు బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఇసుక డంప్‌లు సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 26 (ప్రభాత ఉదయం)**

గట్టు మండలం బల్గెర గ్రామ శివారులో అక్రమంగా నిలువ చేసిన ఇసుక డంపులను గురువారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి టిప్పర్ ల ద్వారా అక్రమంగా ఇసుకను గట్టు మండలం బలిగెర శివారులో గల అడవులో నిలువ చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కు స్థానికులు ఫిర్యాదు చేశారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారుల అనుమతులు లేకుండా గ్రామ శివారులో ఒకే చోట దాదాపు ఎనిమిది టిప్పర్ల వరకు నిలువ చేసిన ఇసుకను పోలీసుల సహాయంతో విచారణ జరిపి సీజ్ చేసినట్లు తహసీల్దార్ విజయ్ కుమార్ తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుకను తొవ్వినా, తరలించినా చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శేఖర్ గౌడ్, ఆర్ఐ, తదితరులు పాల్గొన్నారు. ఇది ఇలా ఉండగా కర్నూల్ గద్వాలకు చెందిన ఇసుక మాఫీయా నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం. కర్ణాటకలోని తుంగభద్రనదీ తీరాన ఉన్న చికలపర్వి క్యాంపు వద్ద, ఏపీలోని గుర్రాల దొడ్డి, కాచాపురం వద్ద ఉన్న ఇసుక రీచుల నుంచి టన్నుకు రూ.200(రెండు వందల రూపాయలు) చెల్లించి పెద్ద టిప్పర్ ల ద్వారా గట్టు, కేటిదొడ్డి మండలాలో అటవీప్రాంతంలో డంపులుగా నిలువ చేస్తున్నట్లు సమాచారం. అక్కడి నుంచి గద్వాల, అయిజ, గట్టు, కేటిదొడ్డి, ధరూర్ మండలాలకు టిప్పర్ ల ద్వారా తరలించి 23 టన్నుల లోడ్ ను 35,000 -40,000 వరకు విక్రయించి తమ జేబులు నింపుకుంటున్నారు. ఇసుక తరలింపులో అక్రమార్కులదే పై చేయిగా ఉందని చెప్పుకోవచ్చు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుండటంతో రాత్రివేళలో గద్వాల, గోనుపాడు, సంగాల, వీరాపురం, ధరూర్ లో పెద్ద మొత్తంలో ఇసుక వ్యాపారులు ఈ వ్యాపారంలో ఆరితేరారు. ఇదిఇలా ఉండగా ఇసుక టిప్పర్లు గట్టు, కేటిదొడ్డి, మల్దకల్, గద్వాల మండలం పోలీస్ స్టేషన్ మీదుగా తరలిస్తున్న స్థానిక పోలీసులు చూసి చూడనట్లు వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మూడు రోజుల క్రితం గద్వాల్ నియోజకవర్గంలో ఓ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్ లను పోలీసులు పట్టుకుని వదిలినట్లు ప్రజలు చర్చించుకోవడం హాట్ టాఫిక్ మారింది.

# అభివృద్ధిలో పరిశ్రమల భాగస్వామ్యం మరింత పెరగాలి





### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

### బొల్లారంలోఐటిసి పరిశ్రమ ఆధ్వర్యంలో పాఠశాలలకు కంప్యూటర్లు, బల్దియాకు ఆటోల పంపిణీ

**పటాన్ చెరు, మార్చి 26 (ప్రభాత ఉదయం):**

పరిశ్రమలు తమ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధుల ద్వారా గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి మరింత సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం అమీన్ పూర్ సర్కిల్ బొల్లారం డివిజన్ పరిధిలో ఐటీసీ పరిశ్రమ సౌజన్యంతో 32 లక్షల రూపాయలతో కొనుగోలు చేసిన కంప్యూటర్లు, చెత్త సేకరణ ఆటోలు, మూడు చక్రాల సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బొల్లారం పరిధిలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తెలంగాణ మోడల్ స్కూల్ పాఠశాలలకు 15 కంప్యూటర్లు, రెండు ప్రింటర్లు, బొల్లారం మున్సిపల్ విభాగానికి ఎనిమిది చెత్త సేకరణ ఆటోలు, దివ్యాంగుల కోసం మూడు మూడు చక్రాల సైకిళ్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐటీసీ కంపెనీ తన సామాజిక బాధ్యతలో భాగంగా పాఠశాలల అభివృద్ధికి, బొల్లారం డివిజన్ పరిధిలో పారిశుధ్యం పనులు పెంపొందించేందుకు సహకారం అందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లోనూ మరిన్ని అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరారు. పటాన్ చెరు నియోజకవర్గంలో ప్రభుత్వం అందించే నిధులతో పాటు స్థానికంగా ఏర్పాటుచేసిన పరిశ్రమల సహకారంతో సిఎస్ఆర్ నిధులను అభివృద్ధి పనులకు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు కలిసి పనిచేస్తే అభివృద్ధి సుసాధ్యం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అత్యున్నత ప్రమాణాలతో విద్యను అందిస్తున్నామని.. ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అమీన్ పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, సిఐ రవీందర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి బాల్ రెడ్డి, బిఆర్టియు రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, సీనియర్ నాయకులు హనుమంత్ రెడ్డి, రవీందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి,లక్ష్మా రెడ్డి,ఐటీసీ సంస్థ జనరల్ మేనేజర్ శ్రీనివాస్, ప్లాంట్ హెడ్ సుబ్రహ్మణ్యం, మాజీ ప్రజాప్రతినిధులు వేణుపాల్ రెడ్డి, సాయి కిరణ్ రెడ్డి,శ్రీకాంత్ యాదవ్, బీరప్ప యాదవ్, సతీష్,రత్నం, కృష్ణ, బీసీ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ఏప్రిల్ 2 నుంచి 5 మండలాల్లో

# ఇంటిగ్రేటెడ్ భూభారతి

### సర్వే నుంచి రిజిస్ట్రేషన్ వరకు.. అంతా ఒకే గొడుగు కిందకు

### ఒకే క్లిక్‌తో సమస్త భూ సమాచారం

### ప్రతి సర్వేనెంబర్‌కు భూధార్ నెంబర్

### రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్ మార్చి 26(ప్రభాత ఉదయం)**



భూపరిపాలనలో సరికొత్త శకం ఆరంభం కాబోతోందని గత ప్రభుత్వ హయాంలో ధరణి తెచ్చిన చిక్కుముడులను విప్పుతూ, రైతులకు అత్యంత పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడమే లక్ష్యంగా కొత్తగా రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ( ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజిమెంట్ సిస్టమ్) ను ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌ సింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. గురువారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ , ఎన్ఐసి అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచన మేరకు తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా భూపరిపాలన సేవలను మరింత వేగవంతంగా అందించడానికి రెవెన్యూ. స్టాంప్స్/ రిజిస్ట్రేషన్ , సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ భూభారతి పోర్టల్‌ను అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి భూలావాదేవీ వివరాలు కనిపించేలా పారదర్శకంగా ఈ పోర్టల్‌ను రూపొందించినట్లు వెల్లడించారు. ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ను నారాయణపేట జిల్లా కొస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలాల్లో వచ్చేనెల 2వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ పైలట్ మండలాల్లో మెరిట్- డీమెరిట్ లను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి అవసరమైన మార్పులు చేర్పులు చేసి రెండవ దశలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేస్తామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని అలాగే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపి భూభారతి పోర్టల్‌ను కూడా తీసుకురావడం జరిగిందన్నారు. భూభారతి చట్టంలో పేర్కొన్నవిధంగా వ్?వసాయ భూములకు సంబంధించి క్రయ విక్రయదారులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.తద్వారా రాష్ట్రంలో భూవివాదాలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ ఐదు మండలాల్లో ప్రతి సర్వే నెంబరుకు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ నెంబర్‌ను కూడా ఇస్తామని తెలిపారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా నక్షాలేని ఐదు గ్రామాల్లో రీసర్వే నిర్వహించి భూధార్ నెంబర్‌ను కేటాయించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నాకూడా ప్రజా కోణంలోనే ఉంటుందన్నారు. ఒక క్లిక్ తో రైతులకు సంబంధించిన భూముల పూర్తి సమాచారం లభించేలా చాలా సులువుగా, సులభతరంగా ఉండేలా ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను రూపొందించామని ఆధార్ నెంబర్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయిన వెంటనే కావలసిన సమాచారం లభిస్తుందన్నారు. అదేవిధంగా ఈ పోర్టల్‌లో ప్రధానంగా సమాచారం సేవలు, సర్వే సేవలు, కరెక్షన్ సేవలు, అప్పీల్ సేవలు, రిజిస్ట్రేషన్ సేవలతోపాటు సిటిజన్ డాష్ బోర్డు సేవలకు సంబంధించి మైల్యాండ్ పోర్ట్‌ఫోలియో, నాలా ఆర్డర్స్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ వివరాలు, ఫీడ్‌బ్యాక్, సంబంధిత అధికారుల వివరాలు, ఆర్వోఆర్, భూధార్ నెంబర్, దరఖాస్తు వివరాలు, మ్యూటేషన్, ఈసీ, మార్కెట్ విలువ, విలేజ్ మ్యాప్, ప్రతి సర్వేనెంబర్‌కు మ్యాప్, ఆర్వోఆర్, గ్రామాల నక్షా, పాస్ బుక్ కరెక్షన్, వంటి పూర్తి సమాచారం, సేవలు లభించేలా మూడు విభాగాలను అనుసంధానం చేస్తూ భూభారతి పోర్టల్ ను పూర్తి స్థాయిలో ప్రజలకు చేరువ చేయబోతున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్, ఇతర భూసేవలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి ఆ ప్రక్రియ పూర్తయ్యేవరకు ప్రతి స్టేజ్ లో దాని వివరాలను తెలియజేస్తూ ఎస్.ఎమ్.ఎస్ ద్వారా ఖాతాదారునికి సమాచారం కూడా అందుతుందన్నారు. ధరణి పోర్టల్‌లో 36 మాడ్యూల్స్ ఉండగా భూభారతి పోర్టల్‌లో ఒకే ఛాప్టర్ కింద తీసుకువచ్చామన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, ఎన్ఐసి అధికారులు పాల్గొన్నారు.



# అర్బన్ సమాజంలో పోలీస్ అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి

### రిటైర్డ్ డి జి పి అంజనీ కుమార్

**హైదరాబాద్ (బండ్లగూడ), మార్చి 26(ప్రభాత ఉదయం)**

ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ లోని సెమినార్ హాల్--2లో ప్రొబేషనరీ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శిక్షణార్థులకు ప్రత్యేక గెస్ట్ లెక్చర్ ను రిటైర్డ్ డి జి పి అంజనీ కుమార్ తో నిర్వహించారు. అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ ఐపీఎస్ నిర్ణయం మేరకు ప్రొబేషనరీ డి ఎస్ పి లకు సీనియర్ అధికారులతో ఇంటరాక్షన్ కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆంజనికుమార్ హాజరై “అర్బన్ సొసైటీలో కమ్యూనలిజం , లా, ఆర్డర్ పై దాని ప్రభావం” అనే అంశంపై ప్రసంగించారు. గెస్ట్ అధికారిని మధుకర్ స్వామి, డిప్యూటీ డైరెక్టర్ (ఇండక్షన్) స్వాగతించి సభను ప్రారంభించారు. తన ప్రసంగంలో ఆంజనికుమార్ అర్బన్ సమాజంలో పోలీస్ అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీస్ అధికారులు మంచి హృదయంతో పాటు సెక్యులర్ భావజాలంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రపంచంలో ఎక్కడైనా అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటాయని, చిన్న స్థాయి మత సంబంధిత వివాదాలను నిర్లక్ష్యం చేస్తే అవే పెద్ద మత కలహాలకు దారి తీసి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తాయని హెచ్చరించారు. అలాగే, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పోలీస్ అధికారులు తమ నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. శాంతి భద్రతలను సమర్థవంతంగా నిర్వహించడానికి కమ్యూనిటీ పోలిసింగ్ విధానాన్ని అమలు చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. అన్ని మతాలను సమానంగా గౌరవించడం, సమగ్ర సమాచారం వ్యవస్థను అభివృద్ధి చేసుకోవడం ద్వారా ప్రజలకు న్యాయం చేయగలమని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ మధుకర్స్వామి, డి ఎస్ పి ఎన్ రామారావు అకాడమీ అధికారులు, శిక్షణార్థులు పాల్గొన్నారు.

# సిఎంతో సామాజిక కార్యకర్త నిఖిల్ డే బృందం భేటీ

**హైదరాబాద్ మార్చి 26(ప్రభాత ఉదయం)**

తెలంగాణ శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని ప్రముఖ సామాజిక కార్యకర్త నిఖిల్ డే బృందం కలిసింది. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాలను నిఖిల్ డే ప్రశంసించారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో చేపడుతున్న ప్రజా వాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయికి తీసుకెళ్ళేందుకు ఈ భేటీలో సమాలోచనలు జరిగాయి. అందుకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. రాజస్థాన్ ప్రభుత్వం చేపడుతున్న జన్ సూచన పోర్టల్ తరహాలో తెలంగాణ లోనూ 'ప్రజా సూచన పోర్టల్ ' ఏర్పాటు చేయాలని చర్చ జరిగింది. వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపడుతున్న అన్ని పథకాలకు సంబంధించిన వివరాలను ఒకే చోటఈ పోర్టల్ లో అందుబాటులో ఉంచుతారు. ఐటీ శాఖ ద్వారా ఈ పోర్టల్ ను అభివృద్ధి చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.తెలంగాణ గిగ్ వర్కర్స్ బిల్ ను నిఖిల్ డే ప్రశంసించారు. ఈ బిల్ దేశంలోనే చారిత్రాత్మకంగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు దాన కిషోర్, వి. శేషాద్రి, బి. అజిత్ రెడ్డి, మాణిక్ రాజ్, దివ్య దేవరాజన్, వేముల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



### మహిళల భద్రతపై

# అవగాహన కార్యక్రమం

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 26(ప్రభాత ఉదయం)**

గద్వాల్ భరోసా సెంటర్ ఆధ్వర్యంలో ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత సెల్ మరియు నేషనల్ సర్వీస్ స్కీమ్ సంయుక్తంగా మహిళలపై లైంగిక దాడులు మరియు పోక్సో (గూజూో) చట్టంపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మీనాక్షి అధ్యక్షత వహించి మాట్లాడారు. నేటి సమాజంలో మహిళల భద్రత అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, ప్రతి మహిళ తన హక్కులు మరియు చట్టపరమైన రక్షణలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు.ముఖ్య అతిథిగా హాజరైన ఎస్.ఐ తారక మాట్లాడుతూ విద్యార్థినులకు మహిళలపై జరిగే నేరాలను ఎలా ఎదుర్కోవాలి, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, పోలీస్ శాఖ అందించే సహాయం ఎలా పొందాలి అనే అంశాలను విద్యార్థినులకు వివరించారు. భరోసా సెంటర్ కోఆర్డినేటర్ శివాని పోక్సో చట్టం ప్రాముఖ్యతను వివరిస్తూ, బాధితులకు భరోసా సెంటర్ ద్వారా అందించే సేవలు మరియు మద్దతు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్స్ సెల్ కన్వీనర్ ఎం. సమత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి. జగన్ మోహన్, అధ్యాపకులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# లాడ్జిపై పోలీసుల దాడి: వ్యభిచార ముఠా అరెస్ట్

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 26(ప్రభాత ఉదయం)**

జాతీయ రహదారిపై ఉన్న గీత లాడ్జి కేంద్రంగా సాగుతున్న అసాంఘిక కార్యకలాపాలకు ఉండవల్లి పోలీసులు చెక్ పెట్టారు. పక్కా సమాచారంతో గురువారం ఉండవల్లి ఎస్ఐ శేఖర్ ఆధ్వర్యంలో ఫోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి ఓ వ్యభిచార ముఠాను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడులో ముగ్గురు విటులు, ఒక మహిళను పోలీసులు రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు.అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదనీ ఎస్ఐ ఆర్.శేఖర్ హెచ్చరించారు. లాడ్జి యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు..

# బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి

### ఇద్దరికి తీవ్రగాయాలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 26( ప్రభాత ఉదయం)**




బైకు అదుపు తప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన కేటిదొడ్డి మండల పోలీస్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ పి.శ్రీనివాసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేటిదొడ్డి మండలం కుచినెర్ల గ్రామానికి చెందిన కుర్వ మల్లేష్, శేషప్ప, మల్లేష్ ముగ్గురు కలిసి కుర్వ అయ్యన్న కుమారుడు మల్లేష్ బైక్‌పై నందిన్నె గ్రామం నుండి కుచినెర్ల గ్రామానికి వెళుతున్నారు. ఈ క్రమంలో కుచినెర్ల వాగు వద్ద బైక్ అదుపు తప్పి చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ క్రమంలో బైక్ నడుపుతున్న మల్లేష్ అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో శేషప్ప, మల్లేష్‌కు ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించచారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన శేషప్ప, మల్లేష్ లను చికిత్స కోసం గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించారు.

### గుర్తుతెలియని వ్యక్తి

# మృతదేహం లభ్యం

### ఆచూకీ కోసం పోలీసుల ఆరా

**కూకట్ పల్లి, మార్చి 26 (ప్రభాత ఉదయం)**



బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సాపూర్ చౌరస్తా వద్ద గురువారం ఒక అజ్ఞాత వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మస్జిద్ రోడ్డు డివైడర్ సమీపంలో శవం పడి ఉందన్న సమాచారంతో బాలానగర్ సీఐ నర్సింహా రాజు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు, మృతుడి వయస్సు 45-50 ఏళ్ల మధ్య ఉంటుందని, అతను తెలుపు రంగు బనియన్ ధరించి ఉన్నాడని వెల్లడించారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని గాంధీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, మృతుడిని గుర్తించిన వారు వెంటనే 8712663209 లేదా 87126 63200 నెంబర్లను సంప్రదించాలని సీఐ నర్సింహా రాజు కోరారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. “RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608